సాక్షి
వరంగల్

గురువారం | 29 | జూన్ | 2023



జీనోమ్ ఎడిటింగ్‌తో...

మొక్కల జన్యు సవరణలతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆస్ట్రేలియా ముర్డోక్ వర్సిటీ సైంటిస్ట్ ఎంజీకే జోన్స్ అన్నారు. - 8లో▸



కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35°/26°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం చల్లాగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మెనూ ప్రకారం భోజనం అందించాలి



సంగెం: ఇంటిని మరిచిపోయేలా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని బాలికలను మంచిగా చూసుకోవాలని జెండర్ అండ్ ఎంక్వైరీ జిల్లా కోఆర్డినేటర్ ఫ్లోరెన్సీ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, వంటగది, స్టోర్ రూంను తనిఖీ చేశారు. బాలికలను మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా మెనూ ప్రకారం భోజనం అందించాలని, పదో తరగతి విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయినులకు సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి కె.నీలిమ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

15 రోజుల్లో కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్ క్లియర్

నర్సంపేట: భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్ 15 రోజుల్లో క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్‌పై బుధవారం కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డితో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ లేబర్ ఆఫీస్ (ఏఎల్‌ఓ) పరిధిలో ఉన్న 4800పై చిలుకు పెండింగ్ క్లెయిమ్స్‌ను క్లియర్ చేసి, 15 రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు పడేవిధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. క్లెయిమ్స్ క్లియర్ చేయాలని కార్మిక శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ పరిష్కరించడానికి కృషి చేసిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మంత్రి మల్లారెడ్డికి కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

సైకియాట్రిస్ట్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్

గీసుకొండ: జిల్లాలో ఎన్‌ఎంహెచ్‌పీ కింద సైకియాట్రిస్ట్ (1) పోస్టును భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కె. వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీ జోన్-1(కాళేశ్వరం, బాసర, రాజన్నసిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం జోన్ల) స్థానికత కలిగిన వారు ఈ నెల 30న ఉదయం 11 గంటలకు తమ కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. వివరాలకు హెచ్‌టీటీపీఎస్://వరంగల్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

కేయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 30న జరగాల్సిన డిగ్రీతో సహా ఇతర పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం తెలిపారు. జూలై 1న గ్రూప్-4 పరీక్ష ఉన్నందున ఈనెల 30న జరగాల్సిన పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. మిగతా పరీక్షలు టైంటేబుల్ ప్రకారమే జరుగుతాయని ప్రకటించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ పట్టుబడి ఐదుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని అధికారులు పి.మల్లారెడ్డి, ఎ.నరేందర్ తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

హన్మకొండ: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాలనుకునే ఆసక్తి కలిగిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14లోని కేబీఆర్ పార్కుకు ఎదురుగా ఉన్న ఎస్సీ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు ఉచిత శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకుండా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులు అర్హులని తెలిపారు.

పోడుదారులకు రైతుబంధు

30 వరకు రైతులు వివరాలు అందించాలి

- జూలై 3 లోపు ఆన్‌లైన్ చేసేందుకు అవకాశం
- జిల్లాలో 3,271 మంది లబ్ధిదారులు.. 7,333 ఎకరాల భూమి

నర్సంపేటరూరల్/ఖానాపురం/నెక్కొండ/నల్లబెల్లి : పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. హక్కుపత్రాలు పొందే రైతులకు రైతుబంధు సైతం అందించడానికి అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలోని ఖానాపురం, నల్లబెల్లి, నెక్కొండ, నర్సంపేట మండలాల్లో పోడు భూముల కోసం 3,353 మంది దరఖాస్తు చేసుకున్నారు. సర్వే చేసిన అనంతరం 3,271 మంది లబ్ధిదారులు.. 7,333 ఎకరాల భూమిని అధికారులు గుర్తించారు. సాంకేతిక కారణాలతో 9 మందిని తగ్గించి, 3,262 మందికి పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. హక్కుపత్రాలు పొందే రైతులకు రైతుబంధు సైతం అందించనుంది. ఇప్పటికే ఇతర రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అవుతున్నాయి. వీరితోపాటు గిరిజన రైతులకు సైతం అందించడానికి వివరాలు సేకరిస్తున్నారు. హక్కుపత్రాలు పొందిన గిరిజన రైతుల వివరాలను ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు.. మండల వ్యవసాయ అధికారులకు అందించారు. వివరాల ఆధారంగా గిరిజన రైతుల వద్ద నుంచి ఆధార్, బ్యాంకు ఖాతాల జిరాక్స్ పత్రాలను స్వీకరిస్తున్నారు. ఖానాపురం మండలంలో సుమారు 1,829 మంది గిరిజన రైతులు, సుమారు 700 ఎకరాల భూమిని గుర్తించారు.



ఖానాపురం : రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఏఈఓ సంతోష్

వీరిలో సుమారు 1200 మంది నుంచి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఆర్‌సీ కమిటీ సభ్యులు వివరాలు సేకరించి వ్యవసాయ అధికారులకు చేరవేస్తున్నారు. సుమారు మరో 629 మంది రైతులు ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు అందించాల్సి ఉంటుంది. ఈనెల 30 లోపు వ్యవసాయ అధికారులకు అందజేస్తే జూలై 3 లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కాగా, ఇప్పటి వరకు 560 దరఖాస్తులను వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కాగా, ఇప్పటికే రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయగా రైతు బంధు డబ్బులు సైతం ఖాతాల్లో జమ అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. నల్లబెల్లి మండలంలో 1083 మంది పోడు రైతులు హక్కుపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా, గ్రామస్థాయిలో 964 మంది రైతుల దరఖాస్తులు ఆమోదించారు. ప్రభుత్వం 906 దరఖాస్తులను ఆమోదించి, 2,700 ఎకరాలకు హక్కుపత్రాలు అందించనుంది. నెక్కొండలో 220 మంది రైతులకు 355 ఎకరాలకు, నర్సంపేట మండలంలో 120 మందికి 237 ఎకరాల భూమికి సంబంధించి హక్కుపత్రాలు అందించనుంది. ఈ మండలాల్లో కూడా అధికారులు పోడు రైతుల వివరాలు సేకరిస్తున్నారు.

ఆన్‌లైన్ చేసేందుకు గడువు పొడిగించాలి

రైతుబంధు కోసం గిరిజన రైతుల నుంచి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఏఈఓలు ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 70దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. నమోదు సమయంలో సర్వర్ మొరాయిస్తోంది. ఉదయం, రాత్రి వేళ నిత్యం కంప్యూటర్‌తో కుస్తీ పడితే సుమారు 120 నుంచి 150 వరకు ఆన్‌లైన్ అవుతున్నాయి. సమయం తక్కువగా ఉండడంతో వ్యవసాయ అధికారులు సైతం ఒత్తిడికి గురవుతున్నారు. గడువు పొడిగించాలని రైతులు కోరుతున్నారు.

రైతులు వివరాలు అందించాలి



హక్కుపత్రాలు కలిగిన వివరాలు పంచాయతీ కార్యదర్శులకు అందాయి. వాటి ఆధారంగా గిరిజన రైతులు ఆధార్, బ్యాంకు ఖాతాల జిరాక్స్‌లను వ్యవసాయ విస్తరణ అధికారులకు లేదా పంచాయతీ కార్యదర్శులకు అందించాలి. సకాలంలో ఆన్‌లైన్ చేస్తేనే రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అవ్వడానికి అవకాశం ఉంటుంది. వివరాలు అందించని రైతులు రైతుబంధును కోల్పోవాల్సి వస్తుంది.

– బోగ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి, ఖానాపురం

ఎమ్మెల్యే 'చల్లా' మోసం చేశారు..



విలేకరులతో మాట్లాడుతున్న వంచనగిరి వాసులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు

- సీఎం మంజూరు చేసిన రూ.5 కోట్లు మళ్లించారు
- వంచనగిరివాసులు, కాంగ్రెస్ నాయకుల ఆరోపణ

గీసుకొండ: వంచనగిరికి సీఎం కేసీఆర్ మంజూరు చేసిన నిధులను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు మళ్లించి తమకు అన్యాయం చేశారని వంచనగిరి గ్రామస్తులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఆరోపించారు. మండలంలోని కోటగండి వద్ద వారు బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. 2017లో అప్పటి ఎమ్మెల్సీ కొండా మురళి వినతి మేరకు సీఎం కేసీఆర్ వంచనగిరికి రూ.9.50 కోట్లు అభివృద్ధి పనులకు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధుల్లో కేవలం రూ.3.38 కోట్ల పనులు చేశారని, మరో రూ.1.29 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొండా మురళి పార్టీ మారాడనే అక్కసుతోనే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గ్రామానికి మంజూరైన రూ.5 కోట్ల బ్యాలెన్స్ నిధులను ఇతర గ్రామాలకు మళ్లించారన్నారు. దీంతో గ్రామంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేకు తగిన బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు. సర్పంచ్, ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కావడంతో ఈజీఎస్ నిధుల మంజూరులోనూ వివక్ష కొనసాగుతోందని పేర్కొన్నారు. మొరం, మట్టి తరలించే వాహనాలు, టెక్స్‌టైల్ పార్కు నుంచి వచ్చిపోయే వాహనాలతో శాయంపేట–స్తంభంపల్లి రోడ్డు శిథిలమైందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మళ్లించిన నిధులను గ్రామానికి కేటాయించి అభివృద్ధి పనులు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ భీమగాని సౌజన్య, సర్పంచ్ అమిరిశెట్టి అనసూర్య, ఎంపీటీసీ నాగరబోయిన రజితసారంగం, మండల కోఆప్షన్ సభ్యుడు రహీం, వార్డు సభ్యులు కరుణాకర్, అమిరిశెట్టి రాజు, నల్ల సురేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలు చేయాలి

వర్ధన్నపేట: ఐసీడీఎస్ పరిరక్షణ కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు సమరశీల పోరాటాలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జూన్ 16న ఆదిలాబాద్‌లో చేపట్టిన జీపు జాత బుధవారం వర్ధన్నపేటకు చేరుకుంది. ముందుగా ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎంఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షురాలు నిర్మల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి జయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దేశంలో పెరిగిపోతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల జీతాలు పెంచలేదన్నారు. 2018లో టీచర్లకు రూ.1500, హెల్పర్లకు రూ.750, మినీ వర్కర్లకు రూ.1250 పెంచి, బడ్జెట్ నుంచి 40 శాతం నిధులు తగ్గించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని చెల్లించడం సాధ్యం కాదని చెబుతున్నాయన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ద్వారా ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అనేక యాప్‌లు పెట్టి పని భారాన్ని పెంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాలు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మొక్కెర రామస్వామి, సహాయ కార్యదర్శి తుమ్మల సాంబయ్య, జిల్లా గౌరవ అధ్యక్షురాలు మీరా, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, కార్యదర్శి లక్ష్మీసత్యవతి, సంగీత, భారతి, రేణుక, అనిత, నాగమణి పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

భర్త పేరు మీద ఉన్న భూమి భార్యకు రిజిస్ట్రేషన్

- పాస్‌పుస్తకం లేకుండా ఎలా చేశారని కుమారుడి ఆందోళన

దుగ్గొండి: భర్త పేరుమీద ఉన్న భూమిని భార్య తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకుంది. అయితే పట్టాదారు పాస్‌పుస్తకం లేకుండా జిరాక్స్ కాపీ ఆధారంగా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని కుమారుడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాడు. ఈ ఘటన దుగ్గొండిలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన అంబరగొండ రవీందర్ 2021, మే నెలలో కరోనాతో చనిపోయాడు. ఆయన పేరున 135 సర్వేనంబర్‌లో 1.34 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అతని పేరుమీద ప్రభుత్వం జారీ చేసిన నూతన పట్టాదారు పాస్ పుస్తకం (టీ22040160118) రవీందర్ మరణానంతరం కుమారుడు మధు దగ్గర ఉంచుకున్నాడు. మధు గీసుగొండ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇదే క్రమంలో తహసీల్దార్ సంపత్.. ఆ భూమిని రవీందర్ భార్య అరుణకు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతి ఆధారంగా ఈ నెల 13న రిజిస్ట్రేషన్ చేశాడు.

మ్యుటేషన్ చేయించుకునేందుకు వెళ్లిన మధు

అంబరగొండ మధు తన తండ్రి రవీందర్ పేరున ఉన్న భూమిని వారసత్వం కింద మ్యుటేషన్ చేయించుకోవడానికి పట్టాదారు పాస్ పుస్తకం పట్టుకుని మీసేవా కేంద్రానికి వెళ్లాడు. ధరణి పోర్టల్‌లో తన తండ్రి పేరు కనిపించకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. సమాధానం సరిగా రాకపోవడంతో బుధవారం మధు, భార్య మాధవి ఇద్దరు కూతుళ్లను వెంట బెట్టుకుని పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆందోళనకు దిగాడు. 15 రోజుల్లో రిజిస్ట్రేషన్ రద్దు చేసి న్యాయం చేస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించాడు.



కార్యాలయం ముందు పురుగుల మందు డబ్బా, పాస్ పుస్తకంతో మధు, కుటుంబ సభ్యులు

అరుణ చీటింగ్ చేసింది : తహసీల్దార్ సంపత్‌కుమార్

తన భర్త రవీందర్ కరోనాతో మృతిచెందాడని, పట్టాదారు పాస్ పుస్తకం పోయిందని, భర్త పేరున ఉన్న భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని అరుణ పలుమార్లు కార్యాలయానికి వచ్చింది. కదరదని చెప్పి తిరిగి పంపించా. మూడోసారి కుటుంబంలో ఎలాంటి తగాదాలూ లేవని, పాస్ పుస్తకం పోయింది వాస్తవమని ప్రాధేయపడింది. దీంతో అరుణ పేరున రిజిస్ట్రేషన్ చేశా. అరుణపై చీటింగ్ కేసు నమోదు చేయించడంతోపాటు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తా.

నాకు ధైర్యంగా ఉంటుందని రిజిస్ట్రేషన్ చేయించుకున్నా..

కాగా, దీనిపై అరుణ మాట్లాడుతూ తాము సంపాదించిన డబ్బులతో కుమారుడి పేరుమీద మరో 1.16 గుంటలు రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపింది. ఇప్పుడే తన మందులు, ఇతర ఖర్చులకు డబ్బులు ఇవ్వడం లేదని, మున్ముందు వృద్ధాప్యంలో ధైర్యంగా ఉంటుందని తన భర్త పేరుమీద ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు చెప్పింది. నా తదనంతరం ఆ భూమి నా కుమారుడికే చెందుతుందని తెలిపింది.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు

వర్ధన్నపేట: గర్భిణులు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. వర్ధన్నపేట పట్టణంలోని సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి ఆధ్వర్యంలో గర్భిణులకు బుధవారం న్యూట్రిషన్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ గర్భిణులు పోషకాహార లోపంతో అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గ్రహించి ఐదో నెల, తొమ్మిదో నెల న్యూట్రిషన్ కిట్‌లను అందజేస్తోందని తెలిపారు. మొదటి దఫా అందించే కిట్ విలువ రూ.1,962, రెండో దఫా అందించే కిట్ విలువ రూ.1818 ఉంటుందన్నారు. హార్లిక్స్ రెండు (ఒక కిలో బరువు కలిగినవి), ఖర్జూరా ఒక కిలో, నెయ్యి అరకిలో, ఐరన్ సిరప్ బాటిల్ (మూడు), అల్బెండజోల్ ట్యాబ్లెట్లు ఒక సీసా, ప్లాస్టిక్ బుట్ట, ఒక కప్పు ఉంటాయన్నారు. పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, రోగులు, వైద్య బృందం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్న డాక్టర్ గోపాల్‌రావు

ప్రభుత్వ భూమిలో గుడిసెలు

- 24 గంటల్లో ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారుల అల్టిమేటం



లక్ష్మీపురంలో గుడిసెవాసులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సంపత్‌కుమార్

దుగ్గొండి: లక్ష్మీపురం గ్రామ చెరువు శిఖం భూమిలోని సర్వే నంబర్-6లో 13.04 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి లక్ష్మీపురం–నీరుకుళ్ల ప్రధాన రహదారిని ఆనుకుని ఉంటుంది. చెరువులోకి వరదనీరు రాకపోవడంతోపాటు ఆయకట్టు లేకపోవడంతో భూమి నిరుపయోగంగా ఉంది. ఇందులో ప్రభుత్వం కమ్యూనిటీ భవనాలు, హెల్త్ సబ్ సెంటర్లను నిర్మిస్తోంది. ఇదే క్రమంలో బుధవారం గ్రామంలోని పలువురు 50కిపైగా గుడిసెలు వేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సంపత్‌కుమార్, ఆర్ఐ రాంబాబు, ఏఎస్సై విజయ్‌కుమార్ లక్ష్మీపురం చేరుకుని గుడిసెవాసులతో మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయడం చట్టరీత్యా నేరమని, 24 గంటల్లోగా ఖాళీ చేయకుంటే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడిసె వాసుల మధ్య గొడవ..

సర్వే నంబర్-6లో కొంతమంది అక్రమంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. పలుమార్లు ఖాళీ చేయాలని చెప్పినా వినలేదు. దీంతో గ్రామస్తులు గుడిసెలువేశారు. తాత్కాలికంగా వేసిన గుడిసెలు తొలగించాలని రెవెన్యూ అధికారులు ఆదేశించడంతో మొదట వేసిన వాటిని తొలగిస్తేనే తాము తొలగిస్తామని భీష్మించారు. ఈక్రమంలో గుడిసె వాసులు రెండు వర్గాలుగా విడిపోయి వాదులాడుకున్నారు. ఒకరినొకరు తోసుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి గొడవను సద్దుమణిగించారు.

పాకాలలో 16.3 ఫీట్ల నీరు

ఖానాపురం: మండలంలోని పాకాల చెరువులో బుధవారం నాటికి 16.3 ఫీట్ల నీరు ఉంది. పాకాల చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు. సుమారు 25 ఫీట్ల వరకు నీరు చేరితే ఆయకట్టు పరిధిలో పూర్తిస్థాయిలో పంటల సాగవుతాయి. కానీ, వర్షాలతో సంబంధం లేకుండా చెరువులో గోదావరి జలాలు అందుబాటులో ఉండనున్నాయి. దీంతో ఆయకట్టు పరిధిలో రైతులు పంటలు సాగు చేసుకోవడానికి వీలుగా గురువారం నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా నీటిని విడుదల చేయనున్నారు.

'ఆటో మెటిక్ వాటర్ లెవల్ రికార్డర్' ఏర్పాటు

పాకాల చెరువులోని నీరు రోజుకు ఎంత వెళ్లిపోతోంది, నీటి మట్టం ఎంత అనే వివరాలను తెలుసుకోవడానికి నూతన పరికరాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని హైడ్రాలజీ శాఖ అధికారులు ×ఆటో మెటిక్ వాటర్ లెవల్ రికార్డర్‌ ౯ పరికరాన్ని ఇటీవల ఏర్పాటు చేయించారు. కాగా, ప్రధాన నీటి వనరుల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న క్రమంలో పాకాలలోనూ ఏర్పాటు చేసినట్లు ఐబీ అధికారులు తెలిపారు.



సరస్సులో ఏర్పాటు చేసిన లెవల్ రికార్డర్

నేరుగా 'వరి'ని విత్తుకోవాలి

చెన్నారావుపేట: రైతులు నేరుగా వరి విత్తనాలు విత్తుకుంటే ఖర్చు తగ్గడమే కాకుండా దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ తెలంగాణ డిప్యూటీ మేనేజర్ పృథ్వీ అన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏసీఈ ప్రాజెక్టులో భాగంగా ఉప్పరపల్లిలో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని 11 మండలాల్లో ఉన్న సుమారు 150 గ్రామాల్లో 8000 మంది వడ్లు పండించే రైతులతో కలిసి పనిచేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టును మార్చి 2023న ప్రారంభించినట్లు వివరించారు. పెట్టుబడిని తగ్గించి, ఆదాయాన్ని పెంచే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఫర్టి కం సీడ్ డ్రిల్ అనే యంత్రంతో నేరుగా వరి విత్తనాలు విత్తే పద్ధతిని రైతులకు నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మెట్ట వరి సాగు కోసం ఫౌండేషన్ తరఫున ఫర్టి కం సీడ్ డ్రిల్ యంత్రాలను పంజాబ్ నుంచి తెప్పించి, ప్రతి మండలానికి ఒక యంత్రం చొప్పున రైతులకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. రైతు దీని ద్వారా రూ.10,000 ఖర్చును తగ్గించుకోవచ్చు. ఈ యంత్రంతో ఎకరాకు సన్నరకం వడ్లు 8–10 కిలోలు, దొడ్డు రకం 10–12 కిలోలు సరిపోతాయి. కేవలం 45 నిమిషాల్లో ఒక ఎకరం వేసుకోవచ్చు. కూలీల ఖర్చు ఉండదు. బురద దుక్కి చేయాల్సిన అవసరం లేదు. సాధారణ పద్ధతిలో ఒక ఎకరం పండించే నీటితో దాదాపు ఈ పద్ధతిలో 5 ఎకరాలు పండించవచ్చు. మిథేన్ వాయువును తగ్గించుకోవచ్చని వివరించారు. రైతులు ఈ పద్ధతి ద్వారా వరి సాగు చేయడానికి ఆసక్తి చూపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వరంగల్ ఏరియా మేనేజర్ రాజు, నర్సంపేట, చెన్నారావుపేట సీఎఫ్ భాస్కర్, రైతులు ఎండీ హఫీజ్, రామచంద్రారెడ్డి, అన్వేష్, ధనుంజయ ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ అధికారులు

దారి కోసం డీఎల్‌ఎస్‌ఏను ఆశ్రయించిన రైతులు



జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉపేందర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న గవిచర్ల రైతులు

సంగెం: వ్యవసాయ బావుల దగ్గరకు వెళ్లే దారిని ఆక్రమించిన వారిపై చర్య తీసుకుని న్యాయం చేయాలని 40 మంది రైతులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శిని బుధవారం కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గవిచర్లకు చెందిన రైతులు 80 ఏళ్లకుపైగా ఎస్సీ కాలనీ నుంచి ఉప్పుకుంట కట్టమీద మీదుగా సింగంకుంట, వెంగాయకుంట వైపు గల వ్యవసాయ భూములకు వెళ్లేవారు. గ్రామానికి చెందిన వేల్పుల మోహన్, గూడ సుదర్శన్ దారిని ధ్వంసం చేసి రైతులు భూములకు వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దారిని పూర్తిగా మూసివేసి ఆక్రమించుకున్నారని, దీంతో తమ వ్యవసాయ భూములకు వెళ్లే దారిలేక, పంటలు వేసుకోలేక నానా అవస్థలు పడుతున్నామని రైతులు పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఉపేందర్‌రావుకు వినతిపత్రం అందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషిచేస్తానని న్యాయమూర్తి హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, రైతులు గూడ వెంకటేశ్వర్లు, తోట జనయ్య, యాదయ్య, కూస సుధాకర్, వేల్పుల మొగిలి, రామచంద్రం, నూనె జగన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కస్టడీకి రిటైర్డ్ ఎంపీడీఓ హత్య కేసు నిందితులు



జనగామ సబ్ జైలు నుంచి నిందితులను కస్టడీలోకి తీసుకుంటున్న పోలీసులు

జనగామ: రిటైర్డ్ ఎంపీడీఓ రామ కృష్ణయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు గిర బోయిన అంజయ్యతో పాటు శ్రీకాంత్, భాస్కర్‌ను పోలీసులు బుధవారం తమ కస్టడీకి తీసుకున్నారు. వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి మనీషా మెహ్రా నిందితులను రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. 11 రోజులు జనగామ సబ్ జైలులో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. రామకృష్ణయ్య హత్య కేసు విషయంలో రెండు రోజులు విచారణ చేసిన అనంతరం, వీరిని తిరిగి కోర్టుకు అప్పగించాల్సి ఉంటుంది.

నిట్‌లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభం



ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ కెమిస్ట్రీ విభాగ ప్రొఫెసర్ వి.రాజేశ్వర్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆర్గానిక్ అండ్ మెడిసినల్ కెమిస్ట్రీ-23 అంశంపై మూడు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ విధానంతో ఆర్గానిక్ మెడిసిన్‌లో నూతన ఆవిష్కరణలకు వేదికగా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో ఇజ్రాయిల్‌కు చెందిన నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అదా యోనాథ్, ప్రొఫెసర్లు డి.బసవయ్య, మహేశ్ లక్ష్మణ్, రామాచారి, పటేల్‌గౌహతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజేశ్వర్ రావు దంపతులను ఘనంగా సన్మానించారు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

త్యాగానికి ప్రతీక బక్రీద్..

దైవాజ్ఞను శిరసావహిస్తూ తన సొంత కుమారుడినే బలి ఇవ్వడానికి సిద్ధమైన తండ్రి.. ఆయన నిర్ణయానికి ఎలాంటి అడ్డు చెప్పకుండాతన ప్రాణం అర్పించడానికి సిద్ధపడిన కుమారుడు.. వీరి భక్తికి ప్రసన్నుడైన దైవం... కత్తిని కుమారుడి గొంతుపై ఎక్కుపెట్టే క్రమంలో ఆయన స్థానంలో దుంబ(గొర్రెపోతు) ప్రత్యక్షమయ్యేలా చేశారు. దీంతో ఆ రోజును ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ (ఈదుల్ జుహా)పండుగగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం ఉదయం ఈ పండుగ అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్యాగానికి ప్రతీకైన ఈదుల్ జుహా (బక్రీద్) పర్వదినంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

-హసన్‌పర్తి/ కాజీపేట/ఖిలావరంగల్



ఖిలా వరంగల్ ఈద్గా ప్రాంగణం

- నేడు ఈదుల్ జుహా వేడుకలు
- ముస్తాబైన ఈద్గాలు, మజీద్‌లు

ఇబ్రహీంకు అనేక పరీక్షలు..

పూర్వీకుల కథనం ప్రకారం మహ్మద్ ఇబ్రహీం.. దేవుడి (అల్లా) ప్రియమైన భక్తుడు. అతడి భక్తిని పరిశీలించడానికి అల్లా అనేక పరీక్షలు పెట్టాడు. ఓ రోజు దైవం.. ఇబ్రహీం కలలోకి వచ్చి నీ ప్రియమైన కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లాకు బలి ఇవ్వాలని ఆజ్ఞాపించాడు. దీనికి ఇబ్రహీం ఏమీ ఆలోచించకుండా భార్యకొడుకును తీసుకుని ఓ నిర్జీవ ప్రదేశానికి బయలుదేరాడు.అయితే మార్గమధ్యలో భార్య ఎక్కడి తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా.. ఇది దైవాజ్ఞ అని చెప్పడంతో ఆమె బదులివ్వదు. ఈ క్రమంలో ఇబ్రహీం వెళ్తుండగా సైతాన్ ఆయనను వెంబడిస్తూ నీవు చేయబోతున్న పని మంచిది కాదు.. కలలో వచ్చి కొడుకును బలిఇవ్వమంటే ఇస్తావా..ఇది న్యాయం కాదు.. నీవు చేయబోతుంది పొరపాటని ఇబ్రహీం మనస్సును సైతాన్ పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తుంది. అయినా ఇబ్రహీం ..సైతాన్ మాటలు లెక్కచేయకుండా దైవ కార్యంలో లీనమై ముందుకు సాగాడు. ఇస్మాయిల్‌ను నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లాడు. అయితే గొంతుపై కత్తి ఎక్కిపెట్టడానికి తండ్రి సహసించడని భావించిన ఇస్మాయిల్.. కళ్లకు గంతలు కట్టుకుని బలి ఇవ్వాలని తండ్రిని కోరాడు. కుమారుడు చెప్పిన విధంగా ఇబ్రహీం కత్తితో కుమారుడి గొంతుపై ఎక్కిపెట్టే క్రమంలోనే ఇస్మాయిల్ స్థానంతో దుంబ(గొర్రె పోతు) ప్రత్యక్షమవుతుంది. ఇబ్రహీం ఆ గొర్రె పోతును జుబహ్ చేశాడని గ్రంథాలు చెబుతున్నాయి.

ఖుర్బానీ ప్రత్యేకత..

ప్రతి మనిషి తన ప్రాణ రక్షణ కోసం ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ. దైవాజ్ఞ మేరకు ఇస్మాయిల్‌ను బలి ఇస్తుండగా ఆయన స్థానంలో (గొర్రె పోతు) ప్రత్యక్షమై ఇస్మాయిల్ ప్రాణాలు రక్షిస్తున్నది. ఖుర్బానీ ఇస్తే ప్రాణాలు, ఆస్తులు రక్షించబడుతాయని ఖుర్బాన్‌లో పేర్కొని ఉంది. దీంతో ఏటా బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ(బలి) ఇవ్వడం ఆనవాయితీగా మారింది.

సామూహిక ప్రార్థనలకు సర్వం సిద్ధం

ఈద్గాలో గురువారం ఉదయం 8.30 గంటలకు ఈదుల్ జుహా ప్రత్యేక ప్రార్థనలు జరుగనున్నాయి. బుధవారం స్థానిక కార్పొరేటర్ సిద్ధం రాజు, ఎమ్మెల్యే నరేందర్ ఈద్గాను సందర్శించారు.బల్దియా ఆధ్వర్యంలో ప్రార్థన స్థలం ముస్తాబు చేశాం. ముస్లింలు సకాలంలో హాజరై ప్రార్థనలు చేయాలి.

ఎంఏ జబ్బార్, ఫోర్ట్‌రోడ్డు ఈద్గా ప్రతినిధి

ముస్తాబైన ఈద్గాలు, మజీద్‌లు

ఈదుల్ జుహా నమాజ్ కోసం మసీదులు ముస్తాబయ్యాయి. ఆయా ఈద్గాలు, మజీద్‌ల్లో గురువారం ఉదయం 8 గంటల లోపే ప్రత్యేక నమాజ్ పూర్తిచేయనున్నారు. ఈమేరకు ఆయా మజీద్‌ల కమిటీలు ప్రకటనలు కూడా చేశాయి.

పొట్టేళ్లు రెడీ..



కాజీపేటలో పొట్టేళ్లను విక్రయిస్తున్న వ్యాపారులు

కాజీపేట: బక్రీద్ పండుగ సందర్భంగా పొట్టేళ్ల విక్రయాలు జోరుగా సాగుతాయి. ఈ పర్వదినం సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడం ముస్లింల ఆచారం. ఈ క్రమంలో వరంగల్ నగరంలోని అనేక ప్రాంతాల్లో వారం ముందు నుంచే పొట్టేళ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పర్వదినానికి శరీరంపై ఎలాంటి గాయాలు లేని పొట్టేళ్లనే ఎక్కువగా కొనుగోలు చేయడానికి ఇష్టపడుతుంటారు. ధర ఎంతైనా సరే పొటేళ్లు మాత్రమే కొనుగోలు చేస్తారు.

పొట్టేళ్ల ధర రూ.12వేల వరకు...

బక్రీద్ సందర్భంగా పొట్టేళ్ల ధర రూ.4 నుంచి రూ.12వేల వరకు పలుకుతోంది. ఆరోగ్యంగా, బలంగా ఉన్న పొట్టేళ్లను గొర్రెలకాపరులు అధిక ధరకు విక్రయిస్తున్నారు. కాగా, బక్రీద్ రోజు దాదాపు వరంగల్ నగరంలో 10వేలకు పైగా పొట్టేళ్లు బలి ఇస్తారని ముస్లింలు చెబుతున్నారు.

'జీనోమ్ ఎడిటింగ్'తో విప్లవాత్మక మార్పులు



కాన్ఫరెన్స్‌కు హాజరైన విదేశీ, స్వదేశీ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు

- సైంటిస్టు ఎంజేకే జోన్స్
- కేయూలో రెండో రోజు కొనసాగిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న ప్రొఫెసర్లు ఎంజీకే జోన్స్, శ్రీల మిత్ర,జెన్నిఫర్ అన్నహరికృష్ణ

కేయూ క్యాంపస్ : మొక్కలలో జన్యుసవరణలతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆస్ట్రేలియా ముర్డోక్ వర్సిటీ సైంటిస్టు ఎంజీకే జోన్స్ అన్నారు. కేయూలోని సెనేట్‌హాల్‌లో నిర్వహిస్తున్న ప్లాంట్ బయోటెక్నాలజీ 'జీనమ్ ఎడిటింగ్' పై నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో బుధవారం ఆయన ప్రసంగించారు. 'జీనోమ్ ఎడిటింగ్' ద్వారా సృష్టించిన నూతన వంగడాలను, పంటలను ఏఏ దేశాలల్లో ఎలా ఉపయోగిస్తున్నారనే అంశంతోపాటు వాటి వినియోగం భవిష్యత్తులో ఎలా ఉంటుందో కూడా వివరించారు. అనంతరం పూణేలోని సావిత్రి బాయి పూలే యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీలమిత్ర .. టమాటా మొక్కల అభివృద్ధిలో వివిధ రకాల ఒత్తిళ్లు, కరువు పరిస్థితులను తట్టుకునేలా ఉండే ప్రయోగాలను వివరించారు, ఓయూ ప్రొఫెసర్ కేవీ రావు.. రసం పీల్చే పురుగులు, క్రిమికీటకాలను తట్టుకునే పత్తి, వరి పంటల గురించి వివరించారు. భారతీయర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సతీశ్ కుమార్.. ట్రాన్స్‌జీన్ టెక్నాలజీ, పరిశోధన గురించి వివరించారు. మలేషియా మలయా యూనివర్సిటీ ప్రొఫెసర్ జెన్నిఫర్ అన్న హరికృష్ణ.. జీవసాంకేతిక జన్యుసవరణల పరిశోధనల ద్వారా నిలబడే అరటి మొక్కలను గురించి వివరించారు. బెంగళూర్ టీఎఫ్ఆర్ ఎన్‌సీబీసీ శాస్త్రవేత్త పీవీ శివ ప్రసాద్.. ఆహార ఉత్పత్తి పెంచడానికి ఉన్న అవకాశాలు వివరించారు. సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రకాశ్ పి కుమార్ మాట్లాడుతూ పంటల అభివృద్ధికి బయో టెక్నాలజీ పరిష్కారమన్నారు. కార్యక్రమంలో కేయూ బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్లు ఎస్ రామస్వామి, ఎ సదానందం, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు రోజారాణి, ఎంవీ రాజం, ప్రశాంత మిశ్రా, కోట శ్రీనివాస్, కేవీ సరిత, రిటైర్డ్ ప్రొఫెసర్లు చేరాలు, మాధురి, కేయూ బయోటెక్నాలజీ విభాగం అధిపతి వెంకటయ్య, ఏవీ రావు, శాస్త్రీ పాల్గొన్నారు.కాగా, అతిథులు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.

ఆకట్టుకున్న పోస్టర్ల ప్రజెంటేషన్స్..

కేయూలో బయోటెక్నాలజీ విభా గం, యూకే అబెర్విసిత్ వెల్స్ యూనివర్సిటీ కొలబరేషన్‌లో ప్లాంట్ బయోటెక్నాలజీ 'జీనమ్ ఎడిటింగ్' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో పలువురు పరిశోధకులు పోస్టర్లను ప్ర జెంటేషన్ చేశారు. జీవసాంకేతిక పరిజ్ఞానంతో నూ తన వంగడాలు తదితర అంశాలపై అక్కడికి వచ్చిన పరిశోధకులు, విద్యార్థులకు తెలిపారు. 25 వ రకు పోసర్లు ప్రజెంటేషన్ చేయగా అందులో ప్రతిభ ప్రదర్శించిన వారికి ప్రోత్సాహకంగా ఈనెల 29న ముగింపు సభలో బహుమతులు అందజేస్తారు.

నేడు ముగియనున్న కాన్ఫరెన్స్

కేయూలో మూడు రోజుల నుంచి జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు గురువారం సాయంత్రం ముగియనుంది. ఈముగింపు సదస్సుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, కేయూ మాజీ వీసీ విద్యావతి, కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, రాజమండ్రి ఐసీఏఆర్, సీటీఆర్ఐ డైరెక్టర్ శేషమాధవ్, కేయూ సైన్స్ డీన్ మల్లారెడ్డి, యూజీసీ కోఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ తదితరులు హాజరవుతారు.

అతివేగంతో అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం
- కల్వర్టును ఢీకొన్న బైక్.. అక్కడికక్కడే మృతి



సాయికుమార్ మృతదేహం

నర్సంపేట రూరల్ : చివరి సంవత్సరం.. కళాశాలకు చివరి రోజు.. దీంతో ఓ యువకుడు ఉదయమే కాలేజీకి చేరుకున్నాడు. అక్కడ స్నేహితులతో ఆనందంగా గడిపాడు. స్మృతులను నెమరువేసుకుని ఎంజాయ్ చేశాడు. ఫొటోలు దిగిన అనంతరం మిత్రులకు వీడ్కోలు చెప్పాడు. మధ్యాహ్నం వ్యక్తిగత పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై వరంగల్ వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డుతోపాటు కల్వర్టును ఢీకొని కాల్వలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన చింతల చెరువు కుంభం సైదులు, ఉమాదేవి దంపతులకు కుమారుడు సాయికిశోర్ (22), కూతురు వైష్ణవి ఉన్నారు. సాయికిశోర్ వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లిలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. లక్నెపల్లిలో కిరాయికి ఉంటూ రోజూ తన బైక్‌పై కళాశాలకు వెళ్లి వస్తాడు. ఈ క్రమంలో కళాశాలలో చివరి రోజు కావడంతో వైవా పూర్తి చేసుకుని స్నేహితులతో ఆనందంగా గడిపాడు. అనంతరం వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై వరంగల్‌కు వెళ్లి వస్తున్నాడు. అతివేగంగా వస్తూ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డుతోపాటు కల్వర్టు ఢీకొని కాల్వలో పడ్డాడు. గమనించిన స్థానికులు 108లో నర్సంపేటకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. దీనిపై సమాచారం అందుకున్న నర్సంపేట రూరల్ ఎస్సై సురేశ్ నాయక్ మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైరాన్‌పల్లిలో యువకుడు..



సాయికృష్ణారెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లికి చెందిన ఇనుగాల సాయి కృష్ణారెడ్డి (23)నగరంలోని ఓమొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం బైక్‌పై బైరాన్‌పల్లి నుంచి హన్మకొండ వైపునకు బయల్దేరాడు. మార్గమధ్యలోని వంగపహాడ్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్.. సాయి కృష్ణారెడ్డి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయి కృష్ణారెడ్డికి తీవ్రగాయాలుకాగా నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. కాగా, మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేశ్ సందర్శించి నివాళులర్పించారు.ఎమ్మెల్యే వెంట సర్పంచ్ సాంబారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని మహిళ..

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాక వద్ద గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్రగాయాలపాలైన ఓ మహిళ.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. జాన్‌పాకకు చెందిన శివరాత్రి రాధమ్మ(50) తన పెద్ద కుమారుడు రాజేశ్ ఇంటి నుంచి చిన్న కుమారుడు వినేశ్ ఇంటికి వెళ్లడానికి రాత్రి 10 గంటలకు వరంగల్-నర్సంపేట రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో నర్సంపేట వైపునకు వెళుతున్న గుర్తుతెలియని కారు ఢీకొంది. దీంతో రాధమ్మకు తీవ్రగాయాలు కాగా ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. బుధవారం మృతురాలి కుమారుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

మద్యానికి బానిసైన తండ్రి..

- మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని
- చికిత్స పొందుతూ మృతి..



భవ్యశ్రీ (ఫైల్)

సంగెం: తండ్రి మద్యం మనడంలేదని మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన సంగెం మండలంలోని కుంటపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెండ్లి రసజ్ఞ, రమేశ్ దంపతులకు కూతురు భవ్యశ్రీ(16), కుమారుడు ఉర్జిత్ ఉన్నారు. భవ్యశ్రీ ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. వీరు తమకున్న ఎకరం భూమిలో వ్యవసాయంతో పాటు ఆటో నడుపుకుంటు, ఐనవోలులో హోటల్ ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల మద్యానికి బానిసైన రమేశ్.. నిత్యం భార్యతో గొడవ పడుతున్నాడు. దీంతో భవ్యశ్రీ తండ్రిని అడ్డుకుంటూ గొడవ పడొద్దంటూ వేడుకునేది. ఈ క్రమంలో రమేశ్.. 19వ తేదీన ఉదయం మద్యం సేవించి వచ్చి గొడవ చేస్తున్నాడు. ఇక తన తండ్రి తాగుడు మానడని.. గొడవ తగ్గదని మనస్తాపం చెందిన భవ్యశ్రీ గడ్డి మందు తాగుతుండగా తమ్ముడు ఉర్జిత్ చూసి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెంటనే 108లో ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. తల్లి రసజ్ఞ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ యాదగిరి తెలిపారు.

కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు

- పురోగతిలో సహకార సంఘాలు
- రూ.12.92 కోట్ల లాభాల్లో వరంగల్ డీసీసీబీ
- బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్

హన్మకొండ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు చెప్పారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్ డీసీసీబీ మహాజన సభ నిర్వహించారు. పూర్వ వరంగల్ జిల్లాల్లోని పీఏసీఎస్ చైర్మన్లు, డీసీసీబీలో సభ్యత్వం కలిగిన చేనేత, గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు. ముందు డీసీసీబీ ప్రగతిని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రవీందర్ రావు మాట్లాడుతూ మీ సేవా కేంద్రాలకు దీటుగా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కామన్ సర్వీస్ సెంటర్‌ల ద్వారా 300 రకాల సేవలు అందించవచ్చన్నారు. ప్రస్తుతం 30 నుంచి 40 రకాల సేవలు అందించేలా రూపకల్పన చేశామన్నారు. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. పీఏసీఎస్‌లు కేవలం ఎరువుల వ్యాపారం, ధాన్యం కొనుగోళ్లకే పరిమితం కాకుండా వ్యాపారాన్ని విస్తరించాలన్నారు. వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించాలన్నారు. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. వరంగల్ డీసీసీబీ గతేడాది రూ.9 కోట్లలో లాభాల్లో ఉండగా ప్రస్తుతం రూ.12.93 కోట్లకు చేరుకుందన్నారు. ప్రగతిలో రాష్ట్రంలోనే వరంగల్ డీసీసీబీ 3వ స్థానానికి చేరుకుందన్నారు. ఈ సందర్భంగా బకాయిలు తీర్చిన 9 పీఏసీఎస్ చైర్మన్‌లను డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, సీఈఓ చిన్నారావు, జిల్లా సహకార అధికారులు సన్మానించారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, జిల్లా సహకార అధికారులు జి.నాగేశ్వర్‌రావు, మద్దిలేటి, సయ్యద్ ఖుర్షీద్, కిరణ్‌కుమార్, డీసీసీబీ జనరల్ మేనేజర్ బి.శ్రీధర్, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ, ఏడీ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అర్చక సమాఖ్య కృషితోనే వేతనం పెంపు

- రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కురాకుల జ్యోతి



మాట్లాడుతున్న జ్యోతి

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ అర్చక సమాఖ్య కృషితోనే ధూపదీప నైవేద్య అర్చకులు రూ.6వేల నుంచి రూ.10వేల వేతనం పొందుతున్నారని రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కురాకుల జ్యోతి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో వరంగల్‌జోన్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖ పరిధిలోని కరీంనగర్, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల 6ఏ, 6బి, 6సీ దేవాలయాలు, ధూపదీప నైవేద్య అర్చకులతో ఆత్మీయ సమ్మేళనం, అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్చకులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉందన్నారు. వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు మాట్లాడుతూ దేవాలయాల ఆవరణలు పచ్చదనం, పరిశుభ్రతతో ఉండాలని అప్పుడే భక్తి భావన కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చకసంఘం అధ్యక్షుడిగా నిట్టూరి సతీష్‌శర్మను ఎన్నుకున్నారు. ఆరు జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు సులోచన, సుప్రియ, చంద్రశేఖర్, సునీత, నవీన్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, అర్చక జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, జాక్ కన్వీ నర్ డీవీఆర్ శర్మ, సమాఖ్య కార్యదర్శి రత్నాకర్, ఉద్యోగుల సంఘం అర్చకులు కృష్ణమాచారి, రవీంద్రాచారి పాల్గొన్నారు.

అర్చకులకు అవగాహన సదస్సు..

వేదపండితులు నాగిళ్ల షణ్ముఖశర్మ, జితేందర్‌శర్మ, సుహాస్‌శర్మ, వజ్రయ్య, సంపత్‌కుమార్‌శర్మ.. 21 కులాలకు చెందిన అర్చకులకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దేవత విగ్రహాలకు ధూప, దీపాలు, నైవేద్యాలు సమర్పించడం, యాగాలు, పూజలు ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు.

బీసీల మధ్య చిచ్చుపెడుతున్న ప్రభుత్వం

- మండిపడిన బీసీ సంఘాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్, పాల్గొన్న బీసీ నాయకులు

హన్మకొండ : బీసీలకు రూ.లక్ష ఇస్తామంటూ బీసీ కులాల మధ్య ప్రభుత్వం చిచ్చు పెడుతుందని బీసీ సంఘాల నాయకులు మండిపడ్డారు. బుధవారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీల వ్యూహారచన సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు రాజ్యాధికారం దిశగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించి బీసీల రాజకీయ నిర్మాణం అనివార్యమనే నిర్ణయానికి వచ్చి ప్రత్యేక పార్టీ ఏర్పాటు దిశగా ఆలోచించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈదునూరి రాజమొగిళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వరంగల్ పూర్తిగా వెనుకబడిపోయిందని, ఇక్కడ మురికివాడలు పెరిగాయని, పేదలకు నేటికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందలేదని, అట్టడుగు అణగారిన వర్గాలు వరదల్లో చిక్కుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ నిర్మాణాన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చేపడుతున్నామన్నారు. వరంగల్‌లో మరోసారి బీసీ ముఖ్య నాయకుల విస్తృత సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో గాజు యుగేందర్ యాదవ్, శ్రీకాంతా చారి, బండారి రవీందర్, బొల్లంపల్లి సారయ్య, తెలంగాణ కొమురయ్య, కేడల ప్రసాద్, పైండ్ల భిక్షపతి, పొదిల రాజు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

■ధర్మసాగర్ మండలం, బంజర్‌పల్లి గ్రామ శివారులో 4 1/2 ఎకరాల వ్యవసాయ భూమి పట్టా పాస్‌బుక్ మరియు రైతుబంధు వస్తుంది, అమ్మకానికి కలదు. సెల్: 9849359714.
[W-785622]

FLAT FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్, అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666 / 8309035091.
[WA-27123]

HOUSE FOR SALE

■S/East 40 feet road Corner 390 sq. yrds plot with 1560 sft G+1 Building at Mamnoor KUDA Layouts, Location. 9032111600.
[W-785621]

■ములుగురోడ్డు, కాకతీయ కెనాల్, కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091.
[WA-27120]

■వరంగల్ రంగశాయిపేట శేషాద్రి హిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy. 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666 / 8309035091
[WA-27117]

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666 / 8309035091
[WA-27114]

SERVICES

డాక్యుమెంట్స్ పోయినవి

■నేను అనగా ఎస్.రెడ్డి కిషేందర్ రెడ్డి, S/o. సాంబరెడ్డి, గ్రా॥ వసంతాపూర్, మం॥ శాయంపేట, జిల్లా హన్మకొండ. నేను వసంతాపూర్ నుండి హైదరాబాద్ వెళ్తుండగా భాగ్యనగర్ కో ఆప్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ జీపీఏ హోల్డర్ గొంది రాజిరెడ్డి, S/o. మల్లారెడ్డి కూకట్‌పల్లిలోని సర్వే నెంబర్. 1007, ప్లాట్ నెం॥ 547, 548, లోని 1000 గజాల భూమికి సంబంధించినవి 809/1999 నెంబర్, తేదీ: 06.03.1999 డాక్యుమెంట్స్ TS03US4251 ఆటోలో వసంతాపూర్ మందారిపేట స్టేజీ మధ్యలో పోయినవి.
[WA-1110383]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

CAFE FOR SALE

■Own your Dream Cafe for sale in Prime Location, Fully equipped, loyal Customer base, Seize the opportunity today. Cont: 7065002820.
[W-785667]

BUSINESS OFFER

■ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710
[DA-37247]

WANTED

■Job Vacancy. TIK PVT LTD. Age:18 to 45 Yrs, Qul: 10th to Any Degree, Salary: 18,000 to 25,000/- Contact Cell: 8074612837
[T-1674]

■ఆదాయం కోసం ఎదురు చూస్తున్నారా! నిరుద్యోగులకు ఉపాధి (పెట్టుబడి లేదు) స్వచ్ఛంద సేవా సంస్థనందు క్రౌడ్ ఫండింగ్ చేయుటకు జిల్లా కో-ఆర్డినేటర్ స్త్రీ/పు కావలెను. వీక్లీ 10K. 81439 09459.
[M-1221327]

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఉచిత వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 3K. ఫోన్: 9848571888
[H-793449]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.